

స్వర్ణ రథంపై సత్యసాయి చిత్ర పటం

కదిలింది సాయిరథం

- పుట్టపర్తిలో మార్మోగిన సాయినామం
- అట్టహాసంగా సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన హిల్‌వ్యూ స్టేడియం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- కిక్కిరిసిన వీధులు



హిల్‌వ్యూ స్టేడియంలో జనసందోహం



అలంకరణలో మహాసమాధి



కలశాలతో మహిళలు

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి నామస్మరణతో పుట్టపర్తి మార్మోగింది. పట్టణ వీధులన్నీ కిటకిటలాడాయి. ప్రశాంతి నిలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. స్వర్ణరథంపై సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి వస్తుండగా గాయకుడు మనో తన పాటతో అరవిందు డోలు వాయిద్యంతో సాగింది. గాయకుల పాటకు భక్తులు లీనమై పులకించిపోయారు. శాంతి వేదిక వరకు సాగిన స్వర్ణ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఎగబడ్డారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డితోపాటు దేశవిదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఉదయం హిల్‌వ్యూ స్టేడియంలో ప్రముఖ గాయకుడు మనో, శివమణి సంగీత విభావరితో అలరించారు. అన్నిరాష్ట్రాల సత్యసాయి భక్త బృందాలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించాయి. సింగర్ మనో పాట పాడుతుండగా.. సత్యసాయి స్వర్ణరథం స్టేడియంలోకి ప్రవేశించింది. దీంతో భక్తుల సాయినామంతో స్టేడియం దద్దరిల్లింది. సాయి రథం ముందు వేదపారాయణం చేస్తూ సాగారు. వేదం, నగర సంకీర్తన, భజన ఒకే వేదికపై ఆధ్యాత్మికత, ఏకత్వాన్ని ప్రతిబింబించాయి. స్వర్ణ రథంపై దివ్యకాంతులతో విరాజిల్లుతున్న సత్యసాయి బాబా దర్శనంతో భక్తులు తన్మయత్వం పొందారు.



ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. వేడుకల మొదటి రోజు నుంచి ప్రముఖులు సందర్శిస్తున్నారు. దీంతో భద్రత కల్పించడం పోలీసు శాఖకు సవాల్‌గా మారింది. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్ నిరంతరం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ.. గడిపారు.



హాజరైన భక్తులు

సాయి కుల్వంత్‌లో..

సత్యసాయి శత జయంతి వేడుకలను ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభామండపంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. విద్యార్థుల వేదపఠనం, భక్తి నివేదనం పేరిట భక్తి గీతాల ఆలాపన చేపట్టారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ప్రశాంతి నిలయం పూర్తిగా నిండిపోయింది.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సెంట్రల్ ట్రస్టు సభ్యులు, సేవాదళ్, జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నాయి.



సాంస్కృతిక ప్రదర్శనలో కళా కారులు



పుష్పాలంకరణలో ప్రవేశ ద్వారం



ఉత్సవాలకు హాజరైన ఉపరాష్ట్రపతి, ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు, మంత్రి నారా లోకేశ్ తదితరులు

సీఎం ఇంటికి కాంగ్రెస్ నేతల క్యూ

- ఢిల్లీ నుంచి వెనుదిరిగిన డీసీఎం ఆప్తులు
- ఖర్గే ఇంట్లో సందడి
- ఆశావహుల్లో ఉత్కంఠ



మత్స్యశాఖ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, డీసీఎం

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయం అలజడి రేగింది. నాయకత్వ మార్పు విషయంలో స్పష్టంగా మూడు గ్రూపులు ఏర్పడినట్లుగా మారింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఒకే వేదికపై కనిపించినా వారి అనుచరులు, ఆప్తులు మాత్రం ఎప్పుడు ఎటువంటి మార్పులు వస్తాయోననే సంశయంతో ఉన్నారు. ఐదేళ్లు నేనే ముఖ్యమంత్రిగా ఉంటానని సీఎం సిద్దరామయ్య రెండురోజుల క్రితం చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ కాదన్నవారు ఎవరన్నారు. కానీ డీకే తమ్ముడు డీకే సురేశ్ మాత్రం సిద్దరామయ్య ఇచ్చిన హామీని నిలబెట్టుకునేవారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కానీ సీనియర్ రాజకీయనేత, బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ మైసూరులో మీడియాతో మాట్లాడుతూ.. రెండున్నరేళ్ల ఒప్పందం ప్రకారం సీఎం పదవిని డీకే శివకుమార్‌కు అప్పగించాలని డిమాండ్ చేశారు. కురుబ కులస్తులు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని పరోక్షంగా తీవ్రమైన సెంటిమెంట్‌ను జోడించారు. శనివారం బెంగళూరు నగరంలో ముగ్గురు నేతలను వారి ఆప్తులు భేటీ అయ్యే విషయంలో బిజీ బిజీ అనిపించింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ప్యాలెస్ మైదానంలో మత్స్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలసి పాల్గొన్నారు. కానీ సిద్దరామయ్య ఇంటికి ఎమ్మెల్యేలు క్యూ కట్టారు. శ్రీనివాస్ మానె, బీకే సంగమేశ్, యాసిర్ పఠాన్, సీపీ యోగేశ్వర్, మంత్రులు బైరతి సురేశ్, సతీశ్ జార్కిహోళి, అజయ్‌సింగ్, యశ్వంతరాయగౌడ, విజయానంద కాశప్ప, రిజ్వాన్ అర్షద్‌లతోపాటు పలువురు వెళ్లారు. సీఎంతో చర్చలు జరిపారు.

ఇక డీకే శివకుమార్ ఆప్తులైన కొంతమంది ఎమ్మెల్యేలు ఢిల్లీ పర్యటన ముగించుకుని బెంగళూరుకు వచ్చారు. ఎయిర్‌పోర్ట్‌లో ఆనేకల్ ఎమ్మెల్యే శివణ్ణ, ఎమ్మెల్సీ రవితోపాటు పలువురు మీడియాతో మాట్లాడుతూ అధిష్ఠానంతో కలిసేందుకు వెళ్లామని అంతకుమించి మాట్లాడేది లేదంటూ దాటవేశారు. మరోవైపు బిహార్ ఎన్నికల బిజీలో ఢిల్లీలోనే గడిపిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం రాత్రి బెంగళూరుకు చేరుకున్నారు. సాధారణంగా వారాంతో ఖర్గే బెంగళూరు లేదా కలబురగిలో అందుబాటులో ఉంటారు. కానీ దాదాపు 20రోజులకుపైగానే ఢిల్లీలోనే ఉన్న ఖర్గే రావడంతో పలువురు నాయకులు ఆయనను కలిసేందుకు ఉత్సాహం చూపారు. మరోవైపు సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు సమయం కోరారు. రాత్రి 8 గంటలకు రావాలని సూచించారు. వారిద్దరి మధ్య ఎటువంటి చర్చలు జరుగుతాయనేది కీలకం కానుంది. సీఎం సిద్దరామయ్య ఆప్తులుగా ముద్రపడిన బృందం 2023 మే నెలలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. లోక్‌సభ ఎన్నికల దాకా మాత్రమే కేపీసీసీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్ కొనసాగుతారనే విషయాన్ని తెరపైకి తెచ్చారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసి ఏడాదిన్నర అవుతున్నా ఎందుకు మార్పు లేదనే అంశాన్ని పరోక్షంగా ప్రశ్నించారు.

చేపలకు గాలం వేయగలను: డీకే

మరోవైపు సీఎం సిద్దరామయ్య సమక్షంలోనే మత్స్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీకే శివకుమార్ ప్రసంగం ఆసక్తికరమైంది. చేపకు గాలం వేసే కళ నాకుందన్నారు. తాను బాల్యంలో నదీ ప్రాంతానికి వెళ్లి చేపలు పట్టేవాడినని, మసీర్ ఫిష్‌ను ఎలాపట్టాలనేది నాకు తెలుసన్నారు. అయితే ఓపిక ఉండాలన్నారు. చేపల వ్యవహారం జాతిలో ఉండదని, నీతి, పట్టుదలపైనే ఆసక్తి ఉంటుందన్నారు. చేప అంటే లక్ష్మి అని, రైతులు భూమిలో పంటసాగు చేసినట్టే మత్స్యకారులు నీటిలో సేద్యం చేస్తారన్నారు. చేపలు ఒక్కోసారి దొరకవని అంతమాత్రాన నిరుత్సాహంతో వదులుకోరని, ఓపికతో కొనసాగితే చేపలు లభిస్తాయన్నారు. ఇదంతా చేపలకు సంబంధించిన అంశం కాదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

ఉత్సాహంగా కెనరా మారథాన్

- పరుగులు తీసిన యువతీయువకులు
- 12వేలమంది భాగస్వామ్యం
- జెండా ఊపి ప్రారంభించిన ఎండీ సీఈఓ సత్యనారాయణరాజు



మారథాన్‌లో కెనరాబ్యాంకు ఎండీ సీఈఓ కే సత్యనారాయణరాజు



10కే రన్ ప్రథమ విజేతకు రూ.2లక్షల నగదు అందజేస్తున్న ఎండీ



10కే రన్ విజేతలు

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కెనరాబ్యాంకు మూడో ఏట నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా ముగిసింది. ఆదివారం తెల్లవారుజామున కంఠీరవ స్టేడియంలో 10కేను ఎండీ సీఈఓ కే సత్యనారాయణరాజు జెండా ఊపి ప్రారంభించారు. 6.30 గంటలకు ప్రముఖ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌తో కలసి సీఎండీ సత్యనారాయణరాజు 5కేకు శ్రీకారం చుట్టారు. 8 గంటలకు 3కే రన్ ప్రారంభమైంది. కంఠీరవ స్టేడియం నిండుగా కెనరాబ్యాంకు టీషర్టులతో భాగస్వామ్యులైనవారంతా చేరడంతో సరికొత్తదనం అనిపించింది. మారథాన్‌ను ఉద్దేశించి సత్యనారాయణరాజు మాట్లాడుతూ 2023లో కెనరాబ్యాంకు మారథాన్‌ను ప్రారంభించామని ప్రస్తుతం మూడోఏట జరుపుతున్నామన్నారు. సమాజంలో అన్నివర్గాలకు ఆరోగ్యం, దేహదారుఢ్యంపై అవగాహన కల్పించాలన్నదే మా ఆశయమన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆరోగ్యంపట్ల మార్పు తీసుకొచ్చేందుకు మారథాన్ వంటి కార్యక్రమాలు, యువత ఆసక్తి చూపుతారనే ఏర్పాటు చేశామన్నారు. 12వేలమందికిపైగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. 10కే పూర్తి చేసినవారు కేవలం యువతే కాదని, ఐదు పదులు దాటినవారు ఉండడం ప్రత్యేకం అన్నారు. ప్రముఖ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ బెంగళూరులో మారథాన్‌లకు, క్రీడా పోటీలకు కొదవ లేదని అయినా కెనరాబ్యాంకు ఒక ఆశయంతో చేపట్టడం సంతోషమన్నారు. ప్రతి వ్యక్తి వయసుతో సంబంధం లేదని కానీ తప్పనిసరిగా ఏదో ఒక క్రీడలో పాల్గొనాలని అప్పుడే వారి శరీరంలో ధృడత్వం, ఆలోచనలు శక్తివంతంగా ఉంటాయన్నారు. 10కేలో ధర్మేంద్రపూనియా అద్భుత ప్రదర్శన ఆకట్టుకుంది. కవితా యాదవ్ మహిళల విభాగంలో 10కే విజేతగా నిలిచారు. 5కేలో జయేశ్‌పాటిల్ విజేత కాగా, 60ఏళ్లలోపు విభాగంలో చందా మహిళల విభాగంలో విజేత అయ్యారు. 3కే రన్‌లో అత్యధికమంది పాల్గొన్నారు. చిన్నారులనుంచి వృద్ధులదాకా అన్నివర్గాలు పరుగులు తీశారు. కంఠీరవ స్టేడియం నుంచి ప్రారంభమైన పరుగు ఎంజీ రోడ్డు, రాజ్‌భవన్‌రోడ్డు, విధానసౌధ రోడ్డు మీదుగా కబ్బన్‌పార్కు సెంట్రల్ లైబ్రరీ నుంచి తిరిగి కంఠీరవ స్టేడియంకు చేరుకున్నారు. 10కే, 5కే, 3కేలకు అనుగుణంగా నిర్ణయించారు. 10కే విజేతలకు రూ.2లక్షల నగదు, రన్నరప్‌కు లక్ష రూపాయలు, మూడో రన్నర్‌కు రూ.50 వేలు, 5కే విజేతలకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు ఇచ్చారు. 5కే, 10కే విభాగాలలో 60ఏళ్లు పైబడినవారికి ప్రత్యేకమైన జ్ఞాపికలను ప్రదానం చేశారు. కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లు, రీజనల్ మేనేజర్‌లు, జనరల్ మేనేజర్‌లతోపాటు బ్యాంకు సిబ్బంది భాగస్వామ్యులయ్యారు.



మారథాన్‌లో పాల్గొన్న వారు



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు


అలరించిన సాంస్కృతిక ఉత్సవం

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ' పేరిట ముద్దేనహళ్ళిలో సాంస్కృతిక ఉత్సవాన్ని జరిపారు. ఆగస్టు 16నుంచి వంద రోజులపాటు సంగీతం, కళలు, నృత్యం సేవా కార్యక్రమాలు సద్గురు మధుసూధనసాయి నేతృత్వంలో జరిగాయి. వందమంది మానవతావాదులు, 140కుపైగా కార్పొరేట్ సంస్థల ముఖ్యులు సమాజసేవలకు గౌరవించారు. 45కుపైగా అంతర్జాతీయ విశ్లేషకులు, భిన్నరంగాల ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, న్యాయనిపుణులను సత్కరించారు. ఆదివారం సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని మధుసూధనసాయి మాట్లాడుతూ సత్యసాయి బాబా అందరినీ ప్రేమించు, అందరికీ సేవ చేయాలనే సందేశంతో ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారన్నారు. సాంస్కృతిక మహోత్సవంలో భాగంగానే 126 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక సేవలు కొనసాగించామన్నారు. ముద్దేనహళ్ళిలో 600 పడకల సామర్థ్యం కల్గిన అతిపెద్ద ఉచిత ప్రైవేట్ ఆసుపత్రిని సామాన్యులకోసం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఉత్సవాలలో 60దేశాలనుంచి 450మంది కళాకారులు, 70మంది గాయకులు, 200మందికిపైగా విద్యార్థులు తమ అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారన్నారు. వంద దేశాలకు సంబంధించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఒకే వేదికనుంచి సాగాయన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యులు సంజీవ్‌సన్యాల్, టీసీఎస్ మాజీ సీఈఓ ఎస్ రామదొరై, పద్మవిభూషణ్ గ్రహీత సంగీతకారుడు అమ్జాద్ అలీఖాన్ పిల్లలు అమాన్ అలీ బంగాశ్, అయాన్ అలీ బంగాశ్‌లు పాల్గొన్నారన్నారు. త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ భాగస్వామ్యులైనట్లు ప్రకటించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

భోగరాజు పట్టాభి సీతారామయ్య (జయంతి)




ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య 1880 నవంబరు 24న పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు, స్వాతంత్ర్యానంతరం పార్లమెంటు సభ్యుడిగా, మధ్యప్రదేశ్ రాష్ట్ర తొలి గవర్నర్‌గా వ్యవహరించారు. తాను స్థాపించిన ఆర్థిక సంస్థలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరగాలని సూచించారు. విలియం టారెన్స్ రాసిన ఎంపైర్ అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువాదం చేశారు. తెలుగుభాషకు, తెలుగు జాతికి చిరస్మరణీయ సేవలందించిన ఆయన 1959 డిసెంబరు 17న తుదిశ్వాస వీడారు. తదుపరి ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

వంగర వెంకటసుబ్బయ్య (జయంతి)



వంగర వెంకటసుబ్బయ్య 1897 నవంబరు 24న తెనాలి ప్రాంతంలో జన్మించారు. తెలుగు నాటక, సినీ రంగాలలో 'వంగర'గా పేరొందిన హాస్యనటుడు. 4వ యేటనే 'చిత్ర నళినీయం' నాటకంలో వేషం వేశారు. 'శ్రీకృష్ణ తులాభారం' నాటకంలో వసంతకుడిగా, 'విప్రనారాయణ' సినిమాలో శిష్యుడిగా కళాహృదయుల మన్ననలు అందుకున్నారు. కన్యాశుల్కం, చక్రపాణి, పల్నాటియుద్ధం, తెనాలి రామకృష్ణ, గీతాంజలి తదితర వందకుపైగా తెలుగు చిత్రాలలో నటించారు. 1975లో కన్నుమూశారు.

అంబరీష్ (వర్ధంతి)



శాండల్‌వుడ్‌లో 'రెబెల్ స్టార్'గా పేరొందిన అంబరీశ్ 1952 మే 29న మండ్య జిల్లా దొడ్డ అరసినకెరెలో జన్మించారు. అసలు పేరు మళవళ్ళి హుచ్చేగౌడ అమరనాథ్. 'నాగరహావు' సినిమాతో తెరంగేట్రం చేశారు. కన్నడ, తమిళ, మళయాళ, తెలుగు, హిందీ చిత్రాలలో నటించారు. రాజకీయాల్లోనూ రాణించారు. విష్ణువర్ధన్ పురస్కారం, ఎన్టీఆర్ పురస్కారం తదితర అవార్డులు పొందారు. 'మండ్యద గండు', 'అంబి'గా పిలవబడే ఆయన 2018 నవంబరు 24న కన్నుమూశారు.

అలరించిన పెట్ ఫియెస్టా



శునకాల ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓరియన్ అవెన్యూమాల్‌లో పెట్ ఫియెస్టా 2025 పేరిట పెంపుడు శునకాల ప్రదర్శన సందర్శకులను అలరించింది. వందకుపైగా పెంపుడు కుక్కలు, పిల్లులు, అరుదైన ఎలుకలు, పక్షులను ప్రదర్శించారు. 500మందికిపైగా సందర్శించారు. ఆఫ్రికన్ గ్రే ప్యారట్‌లు, మకావ్ పక్షులు, ఇగ్వానా, షుగర్ గ్లైడర్‌లు, పర్షియన్ పిల్లులు, కాకేషియన్ షెపర్డ్, బర్నీస్ మౌంటెన్‌డాగ్ వంటి జంతువులను ప్రదర్శించారు. ఇదే సందర్భంగా పెంపుడు జంతువులకు అవసరమైన టీకాలు, ఇతర సేవలను వివరించారు.

క్రీడల్లో పాల్గొని ఒత్తిడిని జయించాలి

● జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ



రాయచూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అనుదినం ఒత్తిడికి గురైయ్యే పోలీసులు క్రీడల్లో పాల్గొనడం ద్వార మానసిక ప్రశాంతతను దక్కించుకోవాలని జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ సూచించారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం పోలీస్ వార్షిక క్రీడోత్సవాలు ప్రారంభమైయ్యాయి. రెండు రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో జిల్లాలోని అన్ని స్టేషన్‌లకు చెందిన పోలీసులు, అధికారులు పాల్గొననున్నారు. ఆదివారం పోటీలను ప్రారంభించిన జడ్పీ సీఈఓ ఈశ్వర్ కాందూ, పోలీసుల వృత్తి అత్యంత ఒత్తిడితో కూడి ఉంటుందని పనిలో నిమగ్నమై ఒత్తిడిని భరించేందుకు క్రీడల్లో పాల్గొనడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. రెండు రోజుల పాటు సాగే క్రీడా పోటీల్లో ప్రతియొక్కరు భాగస్వాములు కావాలన్నారు. జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో మిగితా ఉద్యోగులతో పోలిస్తే పోలీసులకు ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే ఒత్తిడిని జయించేందుకు మానసిక ప్రాశాంతతను దక్కించుకునేందుకే ప్రతి ఏటా విధిగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడంతో పాటు ప్రతినిత్యం వ్యాయామం చేయడం, యోగా చేయడం వంటివి అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.

అమాని చెరువుపై నిర్లక్ష్యం

» అభివృద్ధికి చొరవ చూపాలని గ్రామస్థుల వినతి

» చెరువు నీటి వినియోగదారుల సంఘం డిమాండ్



చెరువు ప్రాంతంలో పెరిగిన కంపచెట్లు



అమాని చెరువు

ముళబాగిలు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మడివాళ అమానికెరె (చెరువు) నిర్లక్ష్యానికి గురైంది. సుమారు 900 ఏళ్ల చరిత్ర కల్గిన చెరువును అభివృద్ధి చేయడంలో చిన్ననీటిపారుదలశాఖ అధికారులు నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. ఈ చెరువు చోళరాజుల కాలంలో ఏర్పాటైంది. చెరువు పక్కనే అప్పట్లోనే సోమేశ్వర ఆలయం నిర్మించగా తనదైన గుర్తింపు కలిగింది. సుమారు 354 ఎకరాల విస్తీర్ణంలో మడివాళ అమాని చెరువు విస్తరించింది. మడివాళ, మోతకపల్లి, ఆచంపల్లి, మద్దేరి, జౌగపల్లి, తాయలూరు, సుణ్ణంగూరు, అగర, దూలపల్లి గ్రామాల పరిధిలో చెరువు ఉంది. ఈ చెరువు నిండితే ఏడాదికి రెండు పంటలు సాగు చేసేవీలుంది. గతంలో ఈ చెరువు నీటి ఆధారంగా సాగు చేసి వేలాదిమంది జీవనంసాగించారు.

అయితే చెరువు మరవ వెళ్లే ప్రదేశంలో వందలాదిగా కంపచెట్లు పెరిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయమే కాకుండా నీరు వృథా అవుతోంది. తగిన చర్యలు తీసుకోవాలని నీటి వినియోగదారుల సంఘం పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. 2010-11లో జీఎస్‌వై పథకం కింద చెరువును అభివృద్ధి చేశారు. ఆ తర్వాత చెరువు గురించి అధికారులు దృష్టి సారించలేదు. రైతుల జీవనాడిగా ఉన్న ఈ చెరువును సంరక్షించేందుకు స్థానికంగా చెరువునీటి వినియోగదారుల సంఘం ఏర్పాటైంది. అయితే సంఘానికి ఎలాంటి నిధులు విడుదల కాలేదు. చెరువు నీటి వినియోగదారుల సంఘం కార్యదర్శి మడివాళ పాపణ్ణ మాట్లాడుతూ చెరువు నిర్వహణ విషయంలో చిన్ననీటి పారుదలశాఖ అధికారులు సరైన దృష్టి సారించడం లేదన్నారు. చెరువు మరవ పారే ప్రదేశంతోపాటు చెరువు చుట్టుపక్కల కంపచెట్లు పెరిగాయని వీటిని తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు ఒక తూమునుంచి నీరు వృథా అవుతోందన్నారు. ఈ అంశాలను జిల్లాధికారి తీవ్రంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రికి రూ.80లక్షల ఆధునిక ఉపకరణాలు

» హెచ్‌డీఎఫ్‌సీ, డీఎఫ్‌యూ సీఎస్‌ఆర్ నిధుల కేటాయింపు



ఆసుపత్రికి ఉపకరణాలు అందజేతలో మంత్రి సుధాకర్ తదితరులు

చింతామణి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చింతామణి ప్రభుత్వ ఆసుపత్రి, తల్లీబిడ్డల విభాగం, అత్యవసర విభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతోపాటు కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునీకరించే లక్ష్యం కలిగినట్టు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటైన కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, డీఎఫ్‌యూ సంస్థలు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.80లక్షల విలువైన అత్యాధునిక ఆప్తాల్మిక్ మైక్రోస్కోప్, అన్ని సదుపాయాలతో కూడిన ఆర్థోపెడిక్ ఆపరేషన్ టేబుల్, ఇతర ఉపకరణాలను ఆసుపత్రి అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తాను కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు మంజునాథ్, బసవరాజ్, సోమశేఖర్‌రెడ్డి, డాక్టర్ లిఖిత, రాజేశ్, డీఎఫ్‌యూ సంస్థ సీనియర్ డైరెక్టర్ జీ సందీపన్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమాధికారి డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తావరకెరెలో అణ్ణమ్మదేవి ఉత్సవం



అణ్ణమ్మదేవి ఉత్సవంలో భక్తులు

బొమ్మనహళ్ళి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరదేవత అణ్ణమ్మదేవి ఉత్సవాలు అన్ని ప్రాంతాలలో నిర్వహించడం ఆనవాయితీ. బీటీఎం లే అవుట్ తావరకెరెలో అణ్ణమ్మదేవి 25వ వార్షిక ఉత్సవాలను ఆదివారం నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు వందలాదిమంది కళశాలతో అమ్మవారికి స్వాగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు మంజునాథ్ మాట్లాడుతూ త్వరలోనే మూడురోజులపాటు అణ్ణమ్మదేవి ఉత్సవం నిర్వహించదలిచినట్టు తెలిపారు. అమ్మవారి జాతర వల్ల ఆరోగ్యంతోపాటు మంచి జరుగుతుందన్న విశ్వాసం భక్తులలో ఉందన్నారు. మంత్రి రామలింగారెడ్డి మార్గదర్శకంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ మునిరాజు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పురవీధులలో అమ్మవారిని ఊరేగించారు. అణ్ణమ్మదేవి ఉత్సవంలో మంత్రి రామలింగారెడ్డి, కాంగ్రెస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కేంద్ర హోంమంత్రితో విజయేంద్ర భేటీ

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర ఢిల్లీలో ఆదివారం భేటీ అయ్యారు. అనంతరం విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ బిహార్ ఎన్నికలను అత్యంత సమర్థవంతంగా నిభాయించి చారిత్రాత్మక విజయం సాధించడంపై మర్యాదపూర్వకంగా కలసి అభినందించానని, ఇది కార్యకర్తలలో స్ఫూర్తి నింపేలా ఉంటుందన్నారు. ప్రస్తుత కర్ణాటక రాజకీయాలపై చర్చించామన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన మార్గదర్శకాలు చేశారన్నారు.



కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విజయేంద్ర

శ్రీనివాస్‌కు ఘన స్వాగతం



అభిమానులతో బీవీ శ్రీనివాస్

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కార్యదర్శి (ఇన్‌చార్జ్ ఆఫ్ గుజరాత్)గా నియమితులైన బీవీ శ్రీనివాస్‌కు నగరంలో ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయం వద్ద కార్యకర్తలు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. 4వేలమందికిపైగా కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ సభ్యులు, మద్దతుదారులు పాల్గొన్నారు. కేపీసీసీ కార్యాలయం దాకా ర్యాలీ సాగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

ఉర్రూతలూగించిన చిన్నారుల నృత్యం

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన కొరియోగ్రాఫర్ రుద్రమాస్టర్ రెండో వార్షికోత్సవాన్ని శనివారం జరిపారు. విజయనగర్‌లోని బంట్స్ సంఘం ప్రాంగణంలో రుద్ర డ్యాన్స్ సంస్థ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా యాంకర్ అనుశ్రీ, రక్షక్ బుల్లెట్‌లు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా నిరంతరంగా వివిధ బృందాలచే డ్యాన్స్ ప్రదర్శనలు కొనసాగాయి. ఉదయం రెండేళ్ల వార్షికోత్సవంలో సాధనలను రుద్ర మాస్టర్ వివరించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో యాంకర్ అనుశ్రీ మాట్లాడుతూ కన్నడ చానెళ్లలో జరిగే డ్యాన్స్ ఈవెంట్లలో రుద్ర మాస్టర్ ప్రత్యేకంగా పేరు సాధించారన్నారు. వేలాదిమంది చిన్నారులలో డ్యాన్స్ అభిరుచిని ప్రోత్సహించారన్నారు. వార్షికోత్సవంలో భాగంగా డ్యాన్స్ నేర్చుకున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా డ్యాన్స్ చేయించారు.



చిన్నారుల బృందం

21న పంచాయతీ ఉద్యోగుల నిరవధిక సమ్మె

రాయచూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : న్యాయమైన డిమాండ్‌ల సాధనతో పాటు విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం కోసం డిసెంబరు 21వతేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తున్నట్లు గ్రామ పంచాయతీ నౌకర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ నాడగౌడ తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులెదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ పలు సందర్భాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు విన్నవించామని పరిష్కారం కోసం శాసనసభలో ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని సూచించినా స్పందన లేదన్నారు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అనివార్యంగా తాము సమ్మెబాట పడుతున్నట్లు ఎంబీ నాడగౌడ వివరించారు. 2021 నుంచి వేతన సవరణ జరగలేదని దీంతో ఆర్థికంగా పంచాయతీ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నట్లు తెలిపారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో పాటు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదన్నారు. తమ డిమాండ్‌ల సాధన కోసం చేపడుతున్న సమ్మెలో గ్రామ పంచాయతీల పరిధిలో పని చేసే అన్ని విభాగాల్లోని నౌకర్లు పాల్గొంటున్నట్లు ఎంబీ నాడగౌడ తెలిపారు.



మాట్లాడుతున్న ఎంబీ నాడగౌడ

ఎత్తినహొళె పథకం అమలు ఎన్నడో..?

శిడ్లఘట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బయలుసీమ ప్రాంతాలకు నీటి సమస్య పరిష్కరించేలా ఎత్తినహొళె పథకానికి సుమారు 33వేల కోట్ల రూపాయలు అంచనాగా ప్రకటించారని ఎప్పుడు అమలవుతుందోననే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. శిడ్లఘట్ట తాలూకాలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి విచ్చేయనుండడం స్వాగతార్హమని అయితే బయలుసీమ ప్రాంతం ఎదుర్కొంటున్న జఠిలమైన సమస్యలపై దృష్టి సారించాలని నీరావరి పోరాట సమితి ఉపాధ్యక్షుడు ముళ్ళూరు హరీశ్ అభిప్రాయపడ్డారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాలుగా ఈ ప్రాంతానికి శుద్ధమైన నది నీటిని ప్రవహించేలా చేయాలని పోరాటాలు కొనసాగుతాయన్నారు. తమ ప్రాంత డిమాండ్లను పరిష్కరించడంలో పాలకులు, ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. హెచ్‌ఎన్ వ్యాలి, కేసీ వ్యాలి నీటిని ఇప్పుడు ఇస్తున్న రెండుదశల్లో శుద్ధీకరణ కాకుండా కనీసం మూడదశల్లో సంస్కరించి అందించాలన్నారు. కాగా పొరుగుజిల్లాల్లో ప్రవహిస్తున్న కృష్ణానది నీటిని ఎత్తినహొళె పథకం ద్వారా అమలు చేస్తామన్న పథకం ఇంతవరకు సాకారం కాలేదన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎత్తినహొళె పథకంపై స్పష్టమైన హామీ లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

నలుగురు బీపీఓ ఉద్యోగుల కిడ్నాప్

» రూ.8.90 లక్షల డిమాండ్ - 8 మంది అరెస్టు

బెంగళూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులుగా చెప్పుకుంటూ బీపీఓ సంస్థ మేనేజర్‌స్థాయి నలుగురు అధికారులను కిడ్నాప్ చేసిన సంఘటనలో 8మందిని అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక సంఘటన జరిగింది. పట్టుబడినవారిలో కోలారు జిల్లా మాలూరు గ్రామీణ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్, మిగిలినవారు ఆ ప్రాంతానికి చెందినవారేనని తెలుస్తోంది. శుక్రవారం రాత్రి 1 గంటకు బెంగళూరు కోరమంగల పోలీస్‌స్టేషన్‌కు చెందినవారిగా చెప్పుకుంటూ అక్కడికి సమీపంలోని ఓ సంస్థలో పనిచేసే నలుగురు మేనేజర్ స్థాయి అధికారులను విచారణ పేరిట బయటకు తీసుకెళ్లారు. కోలారు జిల్లా మాలూరు ప్రాంతంలోని ఓ స్థలంలో ఉంచారు. రూ.8.90 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలుత బ్యాంకు ఖాతాలకు బదిలీ చేయాలని కోరినవారు, ఆ తర్వాత నగదు సమకూర్చాలంటూ హెచ్చరించారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఫిర్యాదు వచ్చిన మేరకు కేసు నమోదు చేసినట్టు ఆగ్నేయ డీసీపీ సారా ఫాతిమా తెలిపారు. నాలుగు బృందాలుగా పోలీసులు గాలింపులు జరపగా 8మందిని అరెస్టు చేశామన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కిడ్నాప్‌కు ఉపయోగించిన 2వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు కిడ్నాప్‌కు గురైనవారినుంచి నగదు రూపంలోనే వసూలు చేయాలని భావించారు.

బోనులో చిక్కిన చిరుత

బెంగళూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా తగ్గలూరు గ్రామంలోని తమ్మయప్పకు చెందిన భూమిలో ఉంచిన బోనులో చిరుత చిక్కింది. ఇటీవల కొన్నిరోజులుగా తగ్గలూరు చుట్టుపక్కల చిరుత సంచారం ఉందనే కారణంతో అటవీశాఖ అధికారులు బోనును అమర్చారు. చివరకు ఆదివారం ఉదయం చిరుత బోనుకు చిక్కింది. ఐదేళ్ల ఆడ చిరుత బోనుకు చిక్కినట్టు అటవీశాఖ అధికారి శివకుమార్ ప్రకటించారు. సదరు చిరుతను బండీపుర అభయారణ్యంలో వదిలివేయనున్నట్టు తెలిపారు. చిరుత బోనుకు చిక్కడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

సోమేశ్వర ఆలయంలో మండలపూజ



విశేష అలంకరణలో సోమేశ్వరస్వామి

శిడ్లఘట్ట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సోమేశ్వర ఆలయంలో 48రోజుల మండలపూజ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ జీర్ణోద్ధరణ అనంతరం విద్యాగణపతి, సోమేశ్వరస్వామి, పార్వతీదేవి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహాలు ప్రతిష్ఠించారు. ప్రతిరోజూ విశేషపూజలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో పుష్పాలతో ముస్తాబు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

» మాజీ మంత్రి లింబావళి



ఫిట్‌నెస్ కేంద్రం ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి లింబావళి

మహదేవపుర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగాను ఉల్లాసంగా ఉండడం సాధ్యమని అందుకే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని మాజీ మంత్రి అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. హూడి పై ఓవర్ వద్ద స్లైవ్ ఫిట్‌నెస్‌సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ తన జీవనశైలిలో యోగాను భాగం చేసుకోవడంతో 75ఏళ్ల అయినా చురుగ్గా, ఆరోగ్యంగా ఉండి అందరికీ ఆదర్శంగా ఉన్నారన్నారు. నేటి హైటెక్‌యుగంలో యువత కూడా శారీరక ధృడత్వంతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించా లన్నారు. ఫిట్‌నెస్ అనేది కేవలం వ్యాయామానికి పరిమితం కాదని, జీవనశైలి, ఆహారం, ఇతరత్రా కలసి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఫిట్‌నెస్ సెంటర్ యజమాని నిఖిత్, మిథున్, బీజేపీ నాయకులు హూడి పిళ్ళప్ప, అనూప్, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.73	1630.51
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,528	3,066
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,313	6,246
నీటి నిల్వ (టీఎంసీలు)	72.42	96.00

పెండింగ్ జరిమానాలపై
50శాతం తగ్గింపు

● సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేశ్ హొసమనె



బళ్లారి సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అభ్యర్థన మేరకు 1991-92, 2019-20 మధ్య పోలీసు శాఖ యొక్క ఈ-చలానాల్లో నమోదైన పెండింగ్ కేసులు, రవాణా శాఖలో నమోదైన వాహనాలు తదితర వాటికి జరిమానా మొత్తంలో 50శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు జిల్లాలీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి, సివిల్ కోర్టు న్యాయాధికారి రాజేశ్ హొసమనె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాయితీ సౌకర్యం డిసెంబరు 12వరకు అందుబాటులోఉంటుందనీ డిసెంబరు 13న జరగనున్న జాతీయ లోక్ అధాలత్ సందర్భంగా ఈ రాయితీ ఇవ్వనున్నామన్నారు. ఎంతో కాలంగా పెండింగ్ ఉన్న వాహనాలకు ఇది ఎంతో ఉపయోగకరమన్నారు. పెండింగ్ చలానాలతో వాహనాలు నడపరాదన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బీమా వర్తించదన్నారు. ప్రజలు, బాధితులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రక్తదానంపై అవగాహన తప్పనిసరి: డీహెచ్ఓ



మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, నవంబరు23(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖాధికారి రమేశ్‌బాబు సూచించారు. ఆదివారం తాలూకా ఆరోగ్యాధికారుల కార్యాలయ హాల్లో జిల్లాఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం కింద సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులకు రక్తం అవసరం అవుతుందన్నారు. రక్తదానంపై ప్రజలకు అవగాహన కల్పించి విరివిగా సేకరించాలన్నారు. 18ఏళ్లు పైబడిన ఆరోగ్యవంతమైన పురుషులు, మహిళలు రక్తదానం చేయవచ్చన్నారు. ప్రపంచంలోనే గొప్పఅవిష్కరణ ఒకరి రక్తాన్ని ఉపయోగించి మరొకరి ప్రాణాలను కాపాడటం. దీనివల్ల చాలా మంది ఆరోగ్యాన్ని మెరగుపరచడం, మరణం నుంచి కాపాడటం సాధ్యమవుతుందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి ఇంద్రాణి మాట్లాడుతూ రక్తాన్ని కృత్రిమంగా సృష్టించలేమని, రక్తదానం చేసి మరొకరి ప్రాణాలు కాపాడాలన్నారు. 18నుంచి 60సంవత్సరాల మధ్య వయస్సు గల ఆరోగ్యవంతులైన స్త్రీ,పురుష లందరూ రక్తదానం చేయవచ్చన్నారు. 45కిలోల కంటే ఎక్కువ బరువు ఉండి, 12.5 గ్రాముల కంటే ఎక్కువ హిమోగ్లోబిన్ ఉన్న మహిళలు నాలుగు నెలలకు ఒకసారి పురుషులు, మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలన్నారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా దాతలు తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు. రక్తదానం చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఇన్-ఛార్జ్ ఖుర్షీద్ బేగం, జిల్లా పర్యవేక్షకుడు గిరీష్, అకౌంటెంట్ హొన్నూరప్ప, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

సముదాయ ఆసుపత్రిని నిర్మించండి

కంప్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో సముదాయ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఎంపీ తుకారాంకి కుడితిని పట్టణ సంఘ సంస్థ నేతలు ఆదివారం వినతిపత్రం అందజేశారు. బళ్లారిలోని ఆయన కార్యాలయంలో భేటీ అయిన నాయకులు ఆసుపత్రి నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా కామేష్, తిమ్మప్ప తదితరులు మాట్లాడుతూ.. కుడితిని పట్టణంలో సముదాయ ఆస్పత్రి ఏర్పడటానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఎంపీ తుకారాం మాట్లాడుతూ కుడితిని పట్టణంలో చేర్చబడినందున అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. వారితో చర్చించి కుడితిని పట్టణంలో సముదాయ ఆస్పత్రి ఏర్పాటుపై దృష్టి సాధిస్తానని తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కుడితిని పట్టణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కుడితిని చుట్టుపక్కల గ్రామాల్లో సరైన వైద్యులు లేక బాధితులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సముదాయ ఆసుపత్రి నిర్మిస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. కుడితిని చుట్టుపక్కల కర్మాగారాలు వుండటంతో అధికంగా ప్రమాదాలు జరుగుతాయాన్నరు. ఇప్పటికైనా ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో వుంచుకుని వెంటనే ప్రభుత్వ సముదాయ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఎంతో మందికి వినతిపత్రం అందజేసినా చర్యలు శూన్యమని వాపోయారు. ఇప్పటికైనా ప్రజలు కష్టాలు గమనించి ప్రభుత్వం ఆసుపత్రి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక రక్షణ వేదిక కుడితిని యూనిట్ అధ్యక్షుడు ఎం తిమ్మప్ప, సామాజిక కార్యకర్త ఆర్ వినోద్ కుమార్, నరేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ తుకారాంకు వినతిపత్రం ఇస్తున్న సంఘ సంస్థ నేతలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీణా, రోహిత్ తదితరులు

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● వారితోనే కుటుంబం క్షేమం: రంగస్థల నటి వీణా

బళ్లారి సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళలు కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తారని రంగస్థల నటి వీణా అన్నారు. ఆదివారం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహించిన తాలూకాస్థాయి మహిళా సెమినార్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుని ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంచుకోవచ్చన్నారు. ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ మహిళల ఆరోగ్యానికి ప్రమాదకరం. నివారణ చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. మహిళలు గర్భాశయ క్యాన్సర్ టీకా వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి రోహిత్ మాట్లాడుతూ రైతులు, మహిళల జీవితాల మెరుగుదల కోసం అమ్మ హేమావతి హెగ్డే 30సంవత్సరాల క్రితం తాలూకా స్థాయిలో ఈ మహిళా జ్ఞాన వికాస కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. మహిళలకు చట్టపరమైన సౌకర్యాలు, స్వాలంబన జీవనం, విద్య, ఉపదాది కుటుంబ నిర్వహణ కీలకమైనవన్నారు. దాదాపు 4,56,000 సంఘాలతో కూడిన ఈసంస్థలో 90శాతం మహిళా సభ్యులు ఉన్నారన్నారు. 51లక్షల మంది సభ్యులలో 40లక్షల మందికి పైగా మహిళా కార్యకర్తలున్నారు. ధర్మస్థల ప్రాజెక్ట్ యొక్క ప్రధాన లక్ష్యం మహిళల జీవితాల అభివృద్ధి అన్నారు. బళ్లారి తాలూకాలో మహిళా సంఘాలను బలోపేతం చేసే దిశగా ఈ సెమినార్ మరో అడుగు అని పాల్గొన్న మహిళలు భావించారు.

సదస్సు కార్యక్రమంలో కళ్యాణ కర్ణాటక ప్రాంతీయ ప్రజా చైతన్య వేదిక మాజీ అధ్యక్షుడు జనార్దనరెడ్డి,సభ్యులు నాగరాజరెడ్డి, పుష్పలత , రూపశ్రీ, వీణాకుమారి, రంగస్థల కళాకారులు, జయశ్రీ, సౌజన్య ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై సీఐటీయూ నిరసన



గడిగ చెన్నప్ప సర్కిల్లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

బళ్లారి సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక చట్టాలపై సీఐటీయూ నిరసన చేపట్టింది. ఆదివారం నగరంలోని గడిగచెన్నప్ప సర్కిల్లో చేపట్టిన నిరసనలో కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు ప్రవేశపెట్టడం సరికాదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో సంపదను సృష్టించే కార్మికుల హక్కులను హరించడం ద్వారా యజమానులకు అనుకూలంగా వాటిని అమలు చేసిందన్నారు. కర్ణాటక ప్రావిజన్స్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవ రాజు , జనవాది మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రకుమారి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యబాబు, ప్రధాన కార్యదర్శి మల్లమ్మ, బీటీపీఎస్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, కిరణ్ కుమారి, గురుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని అరికట్టాలి

● వేరు భూమి సంస్థాపకుడు యశస్సు చంద్రు



బుడగ జంగమ కాలనీలో మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు

కంప్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ గాలిలో పెరిగిపోతున్న కార్బన్ డయాక్సైడ్ దృష్టిలో వుంచుకుని ప్రతి ఒక్కరు తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాతావరణం కాలుష్యం కాపాడాలని వేరు భూమి సంస్థాపకులు యశస్సు చంద్రు పిలుపునిచ్చారు. ఆదివారం కుడితిని పట్టణంలో పరిసరాల ప్రేమ సాలు మరద తిమ్మక్క గుర్తుగా 3వ వార్డులోని బుడగ జంగం కాలనీలోని ఇళ్ల ముందు ఆమె పేరు మీద 114 చెట్లను నాటారు. ఈ కార్యక్రమంలో కుడితిని పట్టణ పంచాయతీ కమ్యూనిటీ మోబిలైజర్లు నళిని, యాస్మిన్ పాల్గొని ప్రతి ఇంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా యశస్ మాట్లాడుతూ జీవితంలో అతి ముఖ్యమైనది ఆరోగ్యం. అంతటి కన్నా గొప్పది మరి ఏది లేదన్నారు. అందుకనే సాలుమరద తిమ్మక్క చెట్లపై పరిసరాలపై ఎక్కువగా ప్రాధాన్యం కల్పించేదని తెలిపారు. అంతాతినే ఆమె డాక్టర్ పద్మభూషణ అవార్డు కూడా అందుకుందన్నారు. ప్రకృతి ప్రేమి అనగానే సాలుమరద తిమ్మక్క గుర్తొస్తారు. అందుకనే ప్రతి ఒక్కరు ఆమెను ఆదర్శంగా తీసుకుని తమ ఇంటి భాగాల్లోను పొలాల్లోను మొక్కలు నాటి పరిసరాలని కాపాడుకోవాలన్నారు. రోజురోజుకి గాలిలో వివిధ ఫ్యాక్టరీల నుంచి కార్బన్‌డయాక్సైడ్ వల్ల పూర్తిగా అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే ఎప్పుడు కుడితిని పట్టణంలో ఏ వార్డులో చూసినా చర్మవ్యాధులు ఆస్తమా క్షయరోగాలు వుండిపోయాయన్నారు. మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్స్‌పెక్టర్ రమేష్, బుడగ జంగం కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు

కంప్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని నారాయణస్వామి క్యాంపులో శనివారం మహిళలు ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు మహిళలు వివిధ క్రీడలు నిర్వహించారు. యేటా కార్తీకమాసం చివరి రోజు క్యాంపులోని మహిళలు ఈ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుని కన్నుల పండుగలా జరుపుకుంటామని తెలిపారు. అందరూ కలిసి ఉసిరి చెట్టు కింద భోజనం చేసి దీపాలు వెలిగించారు.



పూజల్లో పాల్గొన్న మహిళలు

హోసూరు జోన్

ఘనంగా మహారాజగణపతి కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

హోసూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హోసూరులోని అమ్మన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మహారాజగణపతి ఆలయ మహాకుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా తీర్థకుడం, ముళైపారి, పంపై వాయిద్యాల ఊరేగింపు జరిగింది. గంగపూజ, గణపతిపూజ, నవగ్రహ హోమం, సుదర్శన హోమం,, యాగశాల పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. యాగశాల పూజ నుంచి పవిత్ర కళశాలతో తీర్థాలను ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ వినాయకుడు, మురుగన్, అమ్మవారు ఇతర పరివార దేవతల విగ్రహాలకు అభిషేకం, గోపురానికి కుంభాభిషేకం నిర్వహించారు. మహారాజ గణపతికి ప్రత్యేక అభిషేకం, దీపదానం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథన్, తమిళరసన్, నాగరాజ్, మణి పాల్గొన్నారు.

టీవీఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



హోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ మోటార్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్, ప్రభుత్వ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కుప్పుస్వామి శిబిరాన్ని ప్రారంభించారు. కంపెనీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అజిత్ అధ్యక్షత వహించారు. రక్తదాన ప్రాధాన్యతను వక్తలు వివరించారు. అసోసియేషన్ కార్యనిర్వాహకులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మునిరాజ్, ఉపాధ్యక్షుడు కన్నన్, కార్యదర్శి సెందిల్‌కుమార్, ఉపకార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకుడు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

హోసూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద అళగన్ మురుగన్ కొండ ఆలయం కుంభాభిషేక ఘనంగా జరిగింది. బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు దేవతలు మూడు పర్వతాలపై సరళరేఖలో కొలువుదీరిన ప్రాంతం పతిరకాసిగా పిలుస్తారు. సమాంతరంగా మురుగన్ (సుబ్రమణ్యస్వామి) దేవసేనతో కలసి కొండపై మురుగన్ రూపంలో దర్శనమిస్తున్నారు. ప్రస్తుతం మండలాభిషేకంలో భాగంగా 48 రోజులుగా ప్రతిరోజూ విశేషపూజలు చేస్తున్నారు. ఆదివారం స్థానిక యువతులు, మహిళలు ఒకేసారి సామూహికంగా గుమ్మినృత్యం చేశారు. ఈ సాంస్కృతిక ప్రదర్శనను వందలాదిమంది భక్తులు వీక్షించి ఆస్వాదించారు.



గుమ్మి నృత్యంలో మహిళలు

రాజ్యాంగ దినోత్సవానికి సిద్ధంకండి: తహసీల్దార్



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియా బేగమ్

సిరుగుప్ప నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని తహసీల్దార్ గౌసియా బేగమ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతో పూర్వపరాల సిద్ధత సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొనాలని సూచించారు. ప్రధాన రహదారిలో ఊరేగింపు, అనంతరం వేదిక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వాధికారులు, సంబంధిత శాఖాధికారులు కార్యక్రమం నిర్వహించడంపై సిద్ధతలు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బీఈఎం సతీష్, దళిత నాయకులు కొడ్లి మల్లికార్జున, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఉప్పార వెంకోబ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టెక్కలకోట ఉచ్చీరప్ప, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ మద్దేరు సిద్దయ్య, వివిధ సంఘ సంస్థల పదాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హంపిలో సుజయ్ స్కూల్ విద్యార్థులు, పురావస్తు శాఖ అధికారులు

స్మారక చిహ్నాల రక్షణ అందరి బాధ్యత

● పురావస్తు శాఖ డైరెక్టర్ శేషేశ్వర్



స్వచ్ఛతాపనుల్లో విద్యార్థులు

బళ్లారి, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి) చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్తు తరాలకు చరిత్రను అందించాలంటే నేటి యువత అవగాహన అత్యవసరమని పురావస్తు శాఖ డైరక్టర్ డా. ఆర్. శేషేశ్వర్ అన్నారు. ప్రపంచ ప్రఖ్యాత హంపిలోని చక్రతీర్థం, కంపభూప మార్గంలోని తుంగభద్ర నది ఒడ్డున ఉన్న సాలు మంటపాల వద్ద పురావస్తు శాస్త్రం, మ్యూజియంలు, వారసత్వ శాఖ, కమలాపురం హంపి, సుజయ్ ఇన్‌స్కూల్ సీతారాం తాండా ఆధ్వర్యంలో 2025 ప్రపంచ వారసత్వ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక ప్రదేశాల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. స్మారక చిహ్నాలు గతాన్ని గుర్తుచేసే ప్రత్యక్ష పాఠ్య పుస్తకాలలాంటివని, వాటిని రక్షించడం ప్రభుత్వానికే కాదు యువత, ప్రజల బాధ్యత అని అన్నారు. విద్యార్థుల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ, స్మారక చిహ్నాల రక్షణపై తరగతి గదుల్లో మాత్రమే కాక, చారిత్రక ప్రదేశాల్లో ప్రత్యక్ష కార్యక్రమాల ద్వారా అవగాహన పెంచుతున్నామని ప్రిన్సిపల్ అనన్యప్రసాద్ తెలిపారు. హంపి ఫొటో ఎగ్జిబిషన్ గ్యాలరీలో అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ డా. ఆర్. మంజనాయక వివిధ కాలాల్లో హంపి స్మారక చిహ్నాల డాక్యుమెంటేషన్, విభాగం చేపట్టిన పరిరక్షణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. హంపి టూరిస్టు ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ శివకుమార్ నాయక్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, మాదకద్రవ్యాలు దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పురావస్తు పరిరక్షణ ఇంజనీర్ సతీష్, వసంతకుమార్, రిటైర్డ్ టీచర్ లీ, సిబ్బంది పాల్గొన్నారు

ఆలయాల్లో చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, విగ్రహాలను చూపుతున్న పోలీసులు

కంప్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సిరిగేరి, టెక్కలకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవాలయాలలో దొంగతనం చేసిన ఇద్దరు నిందితులను సిరిగేరి పోలీసులు అరెస్టు చేశారు. గత రెండు రోజుల క్రితం కరూరు గ్రామం వద్ద సుంకమ్మ ఆలయంలోను, అమలాపురం గ్రామం వద్ద రేణుక యల్లమ్మ దేవస్థానంలో అమ్మవారు విగ్రహాలు, ఆభరణాలు దొంగిలించిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. సిరిగేరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరూరు గ్రామానిక చెందిన గాదిలింగప్ప, సుంకులమ్మ దేవి ఆలయంలో గత రెండు రోజుల క్రితం తలుపులు పగలగొట్టి దొంగలు చొరబడి అమ్మవారి విగ్రహాలు, ఆభరణాలు దొంగలించారని కేసు నమోదు చేశారు. కేసు నమోదు మేరకు జిల్లా ఎస్పీ శోభారాణి, ఎస్పీ నవీన్ కుమార్, డిప్యూటీ పోలీసులు, డీఎస్పీ మాంతేష్ కూనబేవు, టెక్కలకోట సీఐ చందనగోపాల్ మార్గదర్శకత్వంలో సిరిగేరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శశిధర్ నాయకత్వంలో హెడ్ కానిస్టేబుళ్లు, రోషన్ జమీర్, గంగాధర, మహేష్ బంకర్, కానిస్టేబుళ్లు గాదిలింగప్ప, ప్రభాకర్, రామకృష్ణ, అమరేష్‌లు సోదాలు చేపట్టారు. ఛానాల్ గ్రామంలో అనుమానంతో ఎక్స్‌ఎల్ సూపర్‌పై తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులతో సోదాలు చేపట్టారు. వారి నుంచి ఆలయంలో దొంగలను ఆభరణాలు, విగ్రహాలు, ఆభరణాలు, ఎక్స్‌ఎల్ సూపర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహలింగ అలియాస్ మహేష్ ఆటో డ్రైవర్ ఛానాల్ గ్రామానికి చెందిన వెంకటేష్ హడ్లిగి, వీరి నుంచి రూ.1.25 లక్షలు విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.50 వేలు విలువ చేసే టీవీఎస్ వాహనం, మైలాపురం గ్రామంలో అమ్మవారి ఆలయంలో దొంగతనం చేసిన ఆభరణాలు విలువ రూ.93 వేలు వుంటుందన్నారు. మొత్తం రూ.2.73 లక్షలు విలువ వుంటుందని తెలిపారు. చోరీకి పాల్పడిన దొంగల్ని పట్టుకోవడంతో పోలీస్ స్టేషన్‌లో అధికారులను సిబ్బందికి జిల్లా ఎస్పీ శోభారాణి అభినందనలు తెలిపారు.

ఉరుకుంద ఈరణ్ణస్వామి ఆలయంలో దీపోత్సవం

సిరుగుప్ప నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉరుకుంద ఈరణ్ణస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీపోత్సవంతో మనిషికి జ్ఞానజ్యోతి వికసిస్తుందని ఆలయ అర్చకులు శరణయ్య స్వామి అభిప్రాయపడ్డారు. సదాశివనగర్ కాలనీకి చెందిన మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు